# నమస్తే తెలంగాణ

DISTRICT SUPPLEMENT

# ఖమ్మం

శనివారం 28 అక్టోబర్ 2023
SATURDAY, OCTOBER 28, 2023

KHAMMAM

పేజీలు PAGES : 12


‘ఖమ్మం జిల్లాలో బహురూపులైన నాయకులిద్దరూ పాలేరు నుంచి పోటీ చేయాలని చూస్తుంటరు.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ గేటు కూడా తొక్కనీయమంటరు.. ప్రజలు తలుచుకుంటే వాళ్ల సంగతేంటి..? దుమ్ములేపరా.? నాలుగు పైరవీలు.. నాలుగు కాంట్రాక్టులు చేసుకుని.. డబ్బులు సంపాదించి.. ఆ డబ్బు మదంతో ప్రజలనే కొంటాం.. ప్రజాస్వామ్యాన్నే కొంటాం అని అహంకారపూరిత మాటలు మాట్లాడుతున్నరు.. ఇది రాజకీయమా..? కోట్లకు కోట్లు డబ్బు ఖర్చు పెట్టి.. ప్రజల ఓట్లు పొంది ఆ తర్వాత ఏమార్చి అవే చేతులు కడుపులో పెట్టి పేగులు బయటకు తీస్తరు.. వాళ్ల మాటలు నమ్మితే దెబ్బతింటం. ఎటూ కాకుండా పోతం..’

*- బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్*

‘తుమ్మల 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయి ఇంట్లో మూలకు కూర్చున్నరు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నేను పాత స్నేహాన్ని గుర్తుంచుకొని తుమ్మలకు మంత్రి పదవి ఇచ్చిన. ఎమ్మెల్సీగా గెలిపించిన. ఉమ్మడి ఖమ్మం జిల్లాను అప్పగించి ఏకఛత్రాధిపత్యం ఇస్తే తుమ్మల పార్టీకి చేసింది గుండు సున్న. తుమ్మల రెండు జిల్లాల నుంచి ఒక్క ఎమ్మెల్యే సీటు గెలిపించలేకపోయారు. బీఆర్ఎస్‌కు తుమ్మల అన్యాయం చేసిండా.. తుమ్మలకు బీఆర్ఎస్ అన్యాయం చేసిందా.. అని ఒక్కసారి ఆలోచించాలి’ అని సీఎం కేసీఆర్ అన్నారు.

‘వచ్చే శాసనసభ ఎన్నికల్లో పాలేరు అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించి.. అసెంబ్లీ గుమ్మంలోకి పంపిస్తే నియోజకవర్గంలోని దళితులందరికీ దళితబంధు పథకం వర్తింపజేస్తాం. పూర్తిగా ఆ బాధ్యత నాదే. ఉపేందర్‌రెడ్డి సౌమ్యుడు, ప్రజా సేవకుడు. ఆయన ఉపన్యసించిన తీరు ఆకట్టుకుంది. ఇంత పెద్ద సభలో ప్రసంగంలా కాకుండా.. తన కుటుంబ సభ్యులతో మాట్లాడినట్లుగా ఉంది. ఆపదొస్తే నేనున్నానని.. నా ఫోన్ నంబర్ ఉందా.. అని అడిగే నాయకుడు ఉండడం ఈ ప్రాంత ప్రజల అదృష్టం’ అని ముఖ్యమంత్రి కేసీఆర్ కందాళ పనితీరును కొనియాడారు.



ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, పక్కన పాలేరు అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి, వేదికపై ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు



# దళితబంధువిచ్చే బాధ్యత నాది!

**‘పాలేరు నియోజకవర్గానికి చెందిన ఎస్సీలందరికీ పథకం వర్తింపు**
**జీళ్లచెరువు ప్రజా ఆశీర్వాద సభ సాక్షిగా సీఎం కేసీఆర్ ప్రకటన**
**సభకు నాలుగు మండలాల నుంచి భారీగా తరలివచ్చిన జనం**
**బీఆర్ఎస్ అధినేత ప్రసంగంతో దద్దరిల్లిన సభా ప్రాంగణం**
**‘తుమ్మల’, ‘పొంగులేటి’పై నిప్పులు చెరిగిన ముఖ్యమంత్రి**
**డబ్బుందన్న అహంకారం ఉన్న వారికి ఓటు వేయొద్దు..**
**ప్రజల మనిషి ‘కందాళ’ను గెలిపించాలని ప్రజలకు పిలుపు**

‘మీ ఓటుతో అసెంబ్లీ గుమ్మంలోకి ఎమ్మెల్యేగా పాలేరు బిడ్డను పంపిస్తే నియోజకవర్గంలోని దళితులందరికీ దళితబంధు పథకం వర్తింపజేస్తాం. నిత్యం ప్రజల మధ్య ఉంటూ.. వారి బాగోగులు తెలుసుకుంటూ ఆపదలో ఆదుకునే కందాళ ఉపేందర్‌రెడ్డికి శాసనసభ ఎన్నికల్లో పట్టం కట్టండి.. అక్కున చేర్చుకోండి. ఆయన మళ్లీ మీకు సేవచేసే భాగ్యం కల్పించండి..’ అని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. పాలేరు నియోజకవర్గం కూసుమంచి మండలం జీళ్లచెరువు వద్ద శుక్రవారం పాలేరు ఎమ్మెల్యే, అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ ప్రసంగించారు. ప్రజల మనిషి ‘కందాళ’ను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. *- ఖమ్మం, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*



ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు


